సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 13 । మార్చి । 2025



గురు సన్నిధి.. ఆధ్యాత్మిక పెన్నిధి

హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా ఓ పవిత్ర దర్శనీయ స్థలంగా నేడు నీలకంఠ్రావు పేట దర్గా. ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
కడప	: 6.31	5.09
పులివెందుల	: 6.33	5.14
ప్రొద్దుటూరు	: 6.32	5.13

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.4/24.4

జిల్లాలో గురువారం 24.4 - 37.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

యువత పోరుబాట

- జిల్లాలో యువత పోరు మెగా సక్సెస్
- భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు, విద్యార్థులు
- సూపర్ సిక్స్‌లో ఒక్కటీ నెరవేర్చని ప్రభుత్వం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరుకు తరలివచ్చిన నిరుద్యోగ యువకులు, విద్యార్థులు, పార్టీ నేతలు, కార్యకర్తలు

కడప సెవెన్‌రోడ్స్/కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా యువత పిడికిలి బిగించింది. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో హాజరై ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టింది. నిరుద్యోగ భృతి ఇవ్వాలి, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి, జై జగన్ నినాదాలతో కడప నగరం హోరెత్తింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రమైన కడపలో యువత పోరు నిర్వహించారు. వేలాది మంది తరలిరాగా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. యువత, కార్యకర్తలు చేసిన నినాదాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. అనంతరం పార్టీ నేతలు డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రమిచ్చారు.

- ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, డీసీ గోవింద రెడ్డి, నగరమేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రఘు రామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్ సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేన్ రామాంజులరెడ్డి తోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

కూటమికి ప్రజలు త్వరలోనే బుద్ధిచెప్తారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి



తాము అన్ని లెక్కలు వేసుకున్న తర్వాతే ప్రజలకు హామీలు ఇస్తున్నామని చెప్పిన చంద్రబాబు, లోకేష్ అధికారంలోకి వచ్చి తొమ్మిదినెలలయినా ఒక్క హామీ కూడా అమలు చేసిన పాపాన పోలేదని రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మొదటి సంతకం చేసిన మెగా డీఎస్సీకి దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. గతంలో చంద్రబాబు మిగిల్చిపోయిన అరియర్స్‌ను జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో విద్య కోసం రూ. 38 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలే బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం!

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 750 మెడికల్ సీట్లను మంజూరు చేయించగా, చంద్రబాబు వచ్చాక పీ4 కింద కళాశాలలన్నింటిని ప్రైవేటుపరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను భ్రమల్లో పెట్టి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చకపోగా, విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపులతో భారాలు మోపిందని విమర్శించారు.

420 కేసు నమోదు చేయాలి

- వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు



హామీలను విస్మరించిన రాష్ట్రంలోని కూటమి నేతలపై 420 కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను చంద్రబాబు అటకెక్కించారని దుయ్యబట్టారు. పీఎం కిసాన్‌తోపాటు రైతులకు రూ. 20 వేలు ఇస్తామని నమ్మబలికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల తాము తక్కువ కాలంలోనే రోడ్లపైకి ఎక్కాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. వేలాదిగా ప్రజలు యువత పోరులో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చినా కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడం విచారకరమన్నారు.



యువత పోరు ర్యాలీలో నినాదాలు చేస్తున్న విద్యార్థినులు



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

- కడప నగరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి , కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పులివెందుల పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు వరప్రసాద్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.
- కమలాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాలెం సుబ్బా రెడ్డి,గంగాధర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. చింతకొమ్మదిన్నె రింగురోడ్డు వద్ద నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- ప్రొద్దుటూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ శారద, మున్సిపల్ చైర్మన్ బి. లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పి. బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, జిల్లా ఉపాధ్యక్షుడు పి. నరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.
- బద్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ యువనాయకులు దేవసాని ఆదిత్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా మాజీ చైర్మెన్ గురుమోహన్, రమణారెడ్డి పాల్గొన్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని యర్రగుంట్ల పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పార్టీ ముఖ్య నాయకులు

న్యూస్‌రీల్


నేడు జ్యోతి క్షేత్రానికి ఎంపీ అవినాష్‌రెడ్డి రాక

కాశినాయన: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిక్షేత్రం కాశినాయన ఆశ్రమానికి గురువారం ఉదయం 8.30 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి తెలిపారు. అటవీశాఖ అనుమతులు లేవంటూ అటవీ అధికారులు కూల్చివేసిన ఆలయ కట్టడాలను ఆయన పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జిల్లా నాయకులు వస్తారని, పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ విభాగపు 1, 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం వర్సిటీ వీసీ ఆచార్య జి. విశ్వనాథ కుమార్, రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారులు ఉదయప్రకాష్ రెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకలు లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను బుధవారం దేవదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ కానుకలను లెక్కించగా రూ.33,37,829 లక్షలు నగదు, 50 గ్రాములు బంగారు, 4కేజీలు వెండి లభించిదన్నారు. కార్యక్రమంలో ఆలయ ఆలయ ఈఓ క్రిష్ణానాయక్ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను కట్టడి చేద్దాం

సీజనల్ వ్యాధులపై శిక్షణ కార్యక్రమంలో వైద్యాధికారులు



సీజనల్ వ్యాధులపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

కడప రూరల్: సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కే లక్ష్మీనాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో రాయలసీమ ప్రాంత 8 జిల్లాలకు సంబంధించిన సబ్ యూనిట్ మలేరియా అధికారులకు సీజనల్ వ్యాధులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం అని యూనిట్ మలేరియా అధికారులు గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహించొద్దన్నారు. ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు దోమలను ఉత్పత్తి చేసే బ్రీడింగ్ ప్రాంతాలను తప్పనిసరిగా గుర్తించాలని .. ఆయా గ్రామాల్లో మలేరియా వర్కర్ల చేత తప్పనిసరిగా క్రిమి సంహారక మందులను స్ప్రేయింగ్ చేయించాలని ఆదేశించారు. రాష్ట మలేరియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ రామనాథం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, కడప మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగసుధారాణి, మలేరియా నివారణ అధికారులు ఏ నూకరాజు, బీ వేణుగోపాల్, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- వివిధ అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కావేటి విజయానంద్ సమీక్ష



వీసీలో ఎస్పీ, జేసీతో కలిసి పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 17వ తేదీ నుంచి మార్చి 31 తేదీ వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం అమరావతి నుంచి పదో తరగతి పరీక్షల సన్నద్ధత, కలెక్టర్ కాన్ఫరెన్స్, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కావేటి విజయానంద్ జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

- సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు, ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్‌లు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌లు ఇతర జిల్లా అధికారులతో కలిసి (ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యం) పీ4 పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఓ హజరతయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారిణి రాజ్యలక్ష్మి, డీఈఓ షంషుద్దీన్, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్,మెప్మా పీడీ కిరణ్ కుమార్, పోలీసు, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్లు తెరిచిన ప్రభుత్వ పెద్దలు!

- కాశినాయన కట్టడాలు కూల్చివేతపై క్షమాపణలు చెప్పిన మంత్రి నారాలోకేష్
- దేవదాయశాఖ పరిధిలోకి కాశినాయన జ్యోతి క్షేత్రం ప్రతిపాదనలు
- అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



కాశినాయన జ్యోతి క్షేత్రం

సాక్షి ప్రతినిధి, కడప: లక్షలాదిమంది భక్తుల మనోభావాలపై దెబ్బకొట్టారు. కోట్లాది మంది అన్నార్థులకు శరణార్థిగా ఉన్న ఆశ్రమంపై పగబట్టారు. దశాబ్దాల తరబడి ఉన్న భవనాలను టైగర్ ఫారెస్టు జోన్ అంటూ కూలగొట్టారు. సనాతన ధర్మానికి ప్రతినిధినంటూ కాషాయధారిగా అవతారమెత్తిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీశాఖ నేతృత్వంలోనే కూలగొట్టే చర్యలు చేపట్టారు. కళ్లు మూసుకుపోయిన ప్రభుత్వ పెద్దల కళ్లు తెరుచుకునేలా వైఎస్సార్‌సీపీ నినదించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ గళమెత్తింది. క్రమం తప్పకుండా పోరుబాట పట్టడంతో రాజకీయ దుమారం చెలరేగింది. వెరశి ప్రభుత్వ పెద్దలు దిగివచ్చారు. వైఎస్సార్ జిల్లా కాశినాయన జ్యోతిక్షేత్రంలో కట్టడాలు కూలగొట్టడంపై మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జ్యోతిక్షేత్రాన్ని దేవదాయశాఖ పరిధిలోకి విలీనం చేసుకునేందుకు ప్రతిపాదనలున్నాయని అసెంబ్లీలో బుధవారం ప్రకటించారు.

- జ్యోతి క్షేత్రంలో పురాతన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయం ఉంది. కాశిరెడ్డినాయన అనే సిద్ధుడు బాల్యం నుంచి ఆధ్యాత్మిక చింతనతో దేశాటన చేస్తూ పుణ్యక్షేత్రాల్లో గడిపారు. యోగులు, సిద్ధుల వద్ద దీక్షలు తీసుకున్నారు. పాడుపడిన దేవాలయాలను జీర్ణోద్ధరణ చేయమన్న గురువు ఆదేశాల ప్రకారం జ్యోతి క్షేత్రంలో నరసింహస్వామి దేవాలయాన్ని 1980 దశకంలో పునర్నిర్మాణం చేశారు. అక్కడే నిత్యం వందలాది మందికి అన్నదానం సైతం చేసేందుకు ఆశ్రమం కూడా కట్టారు. కాశినాయన 1995లో పరమపదించాక జ్యోతిక్షేత్రం ..కాశినాయన క్షేత్రం అయింది. ఆంధ్రా, తెలంగాణాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా ఈ క్షేత్రానికి ఏటా వార్షికోత్సవానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. అలాంటి క్షేత్రంలో భక్తుల కోసం, వంట కోసం సత్రాలు నిర్మాణాలు చేపట్టారు. కొన్ని దశాబ్దాలుగా ఈక్షేత్రం అటవీ ప్రాంతంలోనే ఉంది. అక్కడి నుంచి అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి కాలిబాట కూడా ఉంది. ఇన్నాళ్లుగా అటవీ ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రం ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అడ్డం వచ్చింది. ప్రధాన దేవాలయం, కాశినాయిన సమాధి మినహా తక్కిన నిర్మాణాలన్నింటినీ కూల్చివేశారు.

కట్టడాల పరిరక్షణకు అండగా వైఎస్సార్‌సీపీ...

జ్యోతి క్షేత్రం శ్రీశైలం టైగర్‌జోన్ రిజర్వ్ ఫారెస్టులో ఉంది. గతంలో అటవీశాఖ అధికారులు అక్కడి నిర్మాణాలపై అభ్యంతరాలు తెలిపినా కూల్చివేత వరకు వెళ్లలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అక్కడ ఉన్న 13 హెక్టార్ల భూమిని అటవీ చట్టం నుంచి మినహాయించాలని అప్పటి కేంద్ర అటవీ పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు స్వయంగా లేఖ కూడా రాశారు. రోజురోజుకీ భక్తులు పెరగడంతో అక్కడ నిర్మాణాలు అవసరం ఏర్పడిందని, మరో వైపు అసలు అటవీ సంరక్షణ చట్టం రాకముందు నుంచే ఇక్కడ దేవాలయాలు ఉన్నాయని కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనవంతు కర్తవ్యం నిర్వర్తించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సైతం పలుమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి ఇదే సమస్యను తీసుకెళ్లారు. కాశినాయన క్షేత్రం ప్రాశస్త్యం దెబ్బతినకుండా ఉండాలని, భక్తులకు సౌకర్యాలు ఉండేందుకు కృషి చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం మాత్రం వెనుకా ముందు చూడకుండా, భక్తుల మనోభావాలను గుర్తించకుండా కూల్చివేతలు చేపట్టింది. నిత్యం తాను సనాతనవాదిని అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే అటవీశాఖ అధికారులే ఈ కూల్చివేతలు చేపట్టడం గమనార్హం. ఎన్నో దేవాలయాలు శ్రీశైలం అటవీ ప్రాంతంలో ఉన్నాయి. అక్కడ అడ్డురాని అటవీ చట్టం ఇక్కడే ఎందుకు అడ్డుగా ఉందని భక్తులు నిలదీశారు. సనాతన ధర్మాన్ని కాపాడతానని ప్రకటించిన పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని మంత్రిత్వశాఖ కాశినాయన కట్టడాలు కూల్చివేతలు చేస్తుంటే ఆయనేం సమాధానం చెబుతారని వైఎస్సార్‌సీపీ నిలదీసింది.

రాజకీయ దుమారం రేగడంతో...

ఆశ్రమాన్ని ప్రభుత్వమే నిర్వహించండి. కట్టడాలను అటవీశాఖకు వాడుకోండి. కూల్చివేతలు చేపట్టవద్దని భక్తులు, పీఠాధిపతులు నెత్తి నోరు కొట్టుకున్నా కూటమి సర్కార్ కాశినాయన క్షేత్రంలో నిర్మాణాలు కూల్చింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై వైఎస్సార్‌సీపీ పోరుబాట ఎంచుకుంది. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, అధికార ప్రతినిధి శ్యామల కాశినాయన క్షేత్రాన్ని క్రమం తప్పకుండా సందర్శించారు. గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సైతం కాశినాయన క్షేత్రం వెళ్లనున్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ప్రజల చెంతకు వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లింది. నిర్మాణాలు పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ, లక్షలాది మంది భక్తుల మనోభావాలపై దెబ్బ కొట్టడాన్ని ఎత్తిచూపారు. వైఎస్సార్‌సీపీ ప్రత్యక్ష పోరాటానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా హిందు సంఘాలు, పలువురు పీఠాధిపతులు కాశినాయన క్షేత్రంలో కట్టడాలు కూలగొట్టడంపై నిరశన గళం విప్పారు. వెరశి రాజకీయ దుమారం రేగింది. బీజేపీ సైతం అసెంబ్లీలో స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆమేరకు ప్రభుత్వ పెద్దలు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కాశినాయన క్షేత్రంలో కట్టడాలు కూల్చివేతలపై మంత్రి నారా లోకేష్ క్షమాపణలు చెబుతూ ఎక్స్‌లో స్పందించారు. దేవదాయశాఖ పరిధిలోకి చేర్చుకునేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సైతం అసెంబ్లీలో ప్రకటించాల్సి వచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

భద్రత పెంచాలి



కడప పోలీసు కార్యాలయానికి వచ్చిన దస్తగిరి

కడప అర్బన్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు దస్తగిరి తనకు ప్రస్తుతం 1ప్లస్1 భద్రత వుందని, ఈ భద్రతను 2 ప్లస్ 2 చేయాలని కడపలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందచేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్ష్యులుగా ఉన్న వారు వరుసగా చనిపోతున్నారని, ఈ క్రమంలో ఆయన హత్య కేసులో అప్రూవర్‌గా మారిన తనకు ప్రాణహాని వుందని, దీంతో భద్రత పెంచాలని జిల్లా ఎస్పీని కోరేందుకు వచ్చానని మీడియాకు తెలియజేశారు.

ఆటోను ఢీ కొన్న కారు



ఆటోలో ఇరుక్కున్న డ్రైవర్ శ్రీనివాసులు

కమలాపురం : కమలాపురం-ఖాజీపేట మండలాలకు వారధిగా ఉన్న కుందూ వంతెన వద్ద ఆటోను కారు ఢీ కొన్న ఘటనలో ఆటో డ్రైవర్ శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, 108 సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు.. సన్నబల్లెకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తన ఆటోలో గ్రామానికి వెళ్తూ కుందూ వంతెన వద్ద ఆటో ఆపారు. అదే సమయంలో కమలాపురం నుంచి ఖాజీపేట వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొంది. కారు పల్టీలు కొట్టి సమీపంలోని పొలాల్లో పడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఆటో డ్రైవర్ శ్రీనివాసులును 108 సిబ్బంది ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కారులో డ్రైవర్ ఒక్కడే ఉండడంతో క్షేమంగా బయట పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదాములో నిల్వల తనిఖీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని గోదాములను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఈ చంద్రశేఖర్ రాజు బుధవారం పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ కార్యాలయం వద్ద ఉన్న రెండు, వ్యవసాయ మార్కెట్ యార్డులోని రెండు గోదాములలో తనిఖీ చేశారు. సిమెంట్ బస్తాలు, ఇనుప కడ్డీల నిల్వలు పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గోదాములు పరిశీలించి నిల్వలు లెక్కిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో జగనన్న కాలనీలను పరిశీలించి ఇసుక నిల్వలు తనిఖీ చేసిన ఆయన అర్బన్ ఏఈ వెంకటేశ్వర్లు, ముగ్గురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. విజిలెన్స్ డీఈతో పాటు స్థానిక రూరల్, అర్బన్ ఏడీఈలు వెంకటసుబ్బయ్య, గురు ప్రసాద్, ఏఈలు జయనరసింహా, రవి పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడిపై దాడి దారుణం

కడప ఎడ్యుకేషన్ : కడప సీపీఐ నాయకుడు మద్దిలేటిపై రౌడీ మూకలు దాడి చేయడం దారుణమని యలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్, దస్తగిరి అన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దిలేటిని బుధవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి మూకల దాడులు ఇటీవల పెరిగాయన్నారు. మద్దిలేటి కాలు విరిగినా పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంలో అర్థమేమిటని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ , ఎస్పీ స్పందించి డీ చేసిన వారిని అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్త నిరసన చేపడతామన్నారు.

గురు సన్నిధి.. ఆధ్యాత్మిక పెన్నిధి

- హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీక నీలకంఠ్రావుపేట దర్గా
- నేటి నుంచి ఉరుసు ప్రారంభం



ఉరుసుకు ముస్తాబవుతున్న సద్గురు హజరత్ దర్బార్ వలీ అలీషా వలీ, రహంతుల్లా అలైహిబాబా, జలీల్ మస్తాన్‌వలీ సమాధులు



సద్గురు దర్గా స్వామీజీల మహా సమాధి

రామాపురం : ఆరు దశాబ్దాల క్రితం నిర్జీవంగా ఉండి సమాధుల చుట్టూ గోడలు ఉండే ప్రదేశం నేడు ఎందరో భక్తులకు మానసిక ఉల్లాసం కలిగిస్తూ, వారి కోర్కెలు తీర్చే ఆలయంగా మారింది నీలకంఠ్రావుపేట దర్గా.

ఆరు దశాబ్దాల క్రితం అదో నిర్జన ప్రదేశం. అందులో రెండు సమాధులు, చుట్టూ గోడలు, సాయంత్రం వేళల్లో ఫకీరులు పక్క గ్రామమైన నీలకంఠ్రావుపేట, చుట్టు పక్కల గ్రామాల్లో భిక్ష మడిగి తెచ్చుకుని అక్కడే తిని, అక్కడే బస చేస్తుండేవారు. దర్గా అని పిలువబడే ఇక్కడికి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుని వెళుతుండేవారు. ఈ దర్గా అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలో దక్షిణ దిశగా ఒక కిలోమీటరు దూరంలో ఉంది. ఏటా ఘనంగా దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

దర్గా సంక్షిప్త చరిత్ర..

హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా ఓ పవిత్ర దర్శనీయ స్థలంగా నేడు ఈ దర్గా వెలుగొందుతోంది. కడప -చిత్తూరు ప్రధాన జాతీయ రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వెలసిన ఈ దర్గాలో ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఎంతో వైభవంగా ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుపుతారు. సద్గురు హజరత్ దర్బార్ వలీ అలీషా వలీ, రహంతుల్లా అలైహి బాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కనుల పండువగా జరుగుతాయి. అత్యంత మహత్యం కలిగిన ఈ ప్రదేశం శివత్వమని, శివైక్యం పొందిన దర్బారు నగరు పీఠాధిపతి గురువు సద్గురు దర్గాస్వామీజీ తెలిపారు. దత్త పీఠానికి చెందిన మహాపూర్ణత్వ పురుషులైన హజరత్ దర్బారు అలీషావలీ 147 వ సంవత్సరంలో ఈ నిర్జన స్థలంలో సజీవ సమాధిగా సిద్ధి పొందారని స్వామీజీ వివరించారు. అప్పటి అరేబియా దేశస్థులైన హజరత్ దర్బారు షావలీ తన భారత దేశ యాత్ర సందర్భంగా ఈ నిర్జన ప్రదేశ విశేష మహత్యానికి తపోసిద్ధి పొంది ఇక్కడ సమాధి పొందారు.

దర్గా దర్బారులో సాయి మందిరం, విద్యాలయం..

ఇదే ఆశ్రమ సన్నిధిలోనే షిర్డీ సాయినాథుని పంచలోహ విరాట్ విగ్రహంతో కూడిన మందిరం నిర్మించారు. అలాగే పంచలోహ ఉత్సవ విగ్రహం కూడా ఉంది. అలాగే 1-10వ తరగతి వరకు సుందరమైన భవనాలలో తరగతి గదులు, ప్రార్థనా మందిరం ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ ఒక పూట ఉచిత భోజనంతో కూడిన విద్యాదానం చేస్తున్నారు.

మాతాజీ మందిరం..

స్వామీజీకి అహర్నిశలు చేదోడువాదోడుగా ఉండి అంతా తానై వచ్చే భక్తులను ఎంతో ఆప్యాయత అనురాగాలతో ప్రేమగా పలకరించే ఆయన అర్ధాంగి రంగనాయకమ్మ తుదిశ్వాస వదిలారు. అక్కడికి వచ్చే భక్తులందరూ అమ్మ అంటూ మాతృమూర్తి సమాధి దర్గాలో ఏర్పాటు చేసి నిత్యం ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉరుసు ఉత్సవం..

సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి, రహంతుల్లా అలైబాబా జలీల్ మస్తాన్ వలీ బాబా గార్ల ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు గంధమహోత్సవం, 14న శుక్రవారం జెండా మెరవణి , ఉరుసు, రాత్రి హిందూ, మహమ్మదీయ సోదరుల సహకారంతో బ్రహ్మాండమైన వాయిద్యాల నడుమ బెంగళూరుకు చెందిన అస్మా నిఖత్, నాగపూర్‌కు చెందిన సలీం సైదాలతో గొప్ప ఖవాలీ పోటీ ఉంటుంది. 15న తహలీల్ ప్రసాదం అందించడంతో ఉత్సవం ముగుస్తుంది.

సమస్యలకు సత్వర పరిష్కారం

– ఎస్పీ అశోక్‌కుమార్

రాజుపాళెం : సమస్యపై బాధితులు ఫిర్యాదు చేసినపుడు వారికి సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని కడప జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ సిబ్బందికి సూచించారు. రాజుపాళెం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న సమస్యపై ఫిర్యాదు చేస్తే పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎక్కువగా రైతుల పొలం గట్లు, భూమి సమస్యలు ఉంటాయని, అవి ఎలాంటి పరిణామాలకైనా దారి తీస్తాయన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన, బాలమద్దిలేటి, వెంకటరమణ, రామకృష్ణారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాలతో తీసిన చిత్రం

కడప అర్బన్ : గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తోంది. జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప నగరం శివారున అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతూ అక్కడ అనుమానస్పదంగా సంచరించే వారిని గుర్తించనున్నారు. బుధవారం నగరంలోని గుర్రాలగడ్డ, అల్మాస్ పేట బ్రిడ్జి, బుగ్గవంక పరివాహక ప్రాంతం, ఏ.ఎస్.ఆర్ నగర్ పరిసర ప్రాంతాలు, పులివెందుల రోడ్ లోని సాక్షి సర్కిల్ పరిసరాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్స్‌పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

కెపాసిటర్లతో బిల్లులో తగ్గుదల

కడప కార్పొరేషన్ : అధిక లోడ్ వినియోగించే వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు కెపాసిటర్లను సరైన పద్ధతిలో వాడితే విద్యుత్తు బిల్లులు గణనీయంగా తగ్గించుకోవచ్చని వైఎస్సార్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్‌రమణ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యుత్ లోడ్ ఆన్ అయినప్పుడు మాత్రమే కెపాసిటర్లు ఆన్ కావాలన్నారు. కెపాసిటర్ల సామర్థ్యం విద్యుత్ లోడ్‌కు 65 శాతం నుంచి 75 శాతం వరకూ ఏర్పాటు చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఉదాహరణకు 100 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న విద్యుత్ లోడుకు 65 నుండి 75 కేవీఏఆర్ కెపాసిటీ కెపాసిటర్లు వాడితే యూనిటీ పవర్ ఫ్యాక్టర్ 1.0 ఉంటుందని, దీంతో బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు.

హజ్ యాత్రపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సినీనటుడు ఆలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లింలు పవిత్రంగా భావించే హజ్, ఉమ్రా యాత్రలపై అవగాహన అవసరమని సినీ నటుడు ఆలీ పేర్కొన్నారు. స్థానిక ఎస్కే గ్రాండ్‌లో అల్ ఇన్ఫో టెక్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కడప, కర్నూలు, రాయచోటి ప్రాంతాల్లో తనకు బంధువులున్నట్లు తల్లిదండ్రులు చెబుతుండేవారని పేర్కొన్నారు. హాస్య నటుడు రాజబాబును స్ఫూర్తిగా తీసుకుని సినిమాలోకి వచ్చానని, 45 సంవత్సరాల సినీ ప్రయాణంలో 1260 సినిమాల్లో నటించానని చెప్పారు. తక్కువ ధరలోనే హజ్, ఉమ్రాకు ఆల్ ఇన్ఫోటెక్ సంస్థ ప్యాకేజీలను ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. వీఎస్ ముక్తియార్, షేక్షా, అయూబ్ ఖాన్, అబ్దుల్ అజీం, మౌలానా అబ్దుల్ మొహిద్దీన్ సాహెబ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాతంగా జరిగాయి. ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 14900 మంది విద్యార్థులకుగానూ 14310 మంది హాజరైనట్లు ఆర్ఐవో బండి వెంకట సుబ్బయ్య తెలిపారు. జనరల్‌కు సంబంధించి 11,289 మంది, ఒకేషన ల్‌కు సంబంధించి 1075 మంది హాజరయ్యారు.

ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీదే అధికారం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.సతీష్‌కుమార్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్వీ.సతీష్ కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా విలేకరులతో సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ప్రజల వ్యతిరేకత కూడగట్టుకుందన్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తే 151 స్థానాల్లో విజయం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడంలోనూ, ప్రజల సంక్షేమం కోసం పెద్దపీట వేయడంలోనూ ఆయన ముందున్నారన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో అన్ని పార్టీలు ఏకమై కోట్లు ఖర్చు పెట్టి అసత్య ప్రచారాలతో సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందాలన్నా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు నడుంబిగించాలన్నారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడవద్దు

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్



పశు వైద్య కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ప్రొద్దుటూరు రూరల్ : న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకూ ప్రభుత్వ బెదిరింపులకు భయపడవద్దని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో పశు వైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు వైద్యార్థులు అడుగుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, న్యాయమైన డిమాండ్లే అన్నారు. ఒక సాధారణ ఉద్యోగి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వ జీఓలో ఉందన్నారు. విద్యార్థులు నిరసన వ్యక్తం చేసే క్రమంలో ప్రభుత్వం నుండి బెదిరింపులు రావడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులు, ప్రజా, విద్యార్థి, కుల సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల స్టైఫండ్ విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో మాట్లాడతానని తెలిపారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, జేవీవీ రాష్ట్ర సమత నాయకురాలు డాక్టర్ ప్రసన్న, సీపీఎం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, ఆప్కాస్ పశు వైద్య కళాశాల అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

19న విజయవాడలో మహా ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఈ నెల 19న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో చలో విజయవాడ కరపత్రాలను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 86,500 మంది పేద, మధ్య తరగతి అట్టడుగు వర్గాల మధ్యాహ్న భోజన కార్మికులకు నామమాత్రంగా రూ.3 వేలు ఇస్తున్నారన్నారు. నిత్యావసర ధరల పెరుగుదలతో తమ కుటుంబ పోషణ కష్టమవుతోందని, నెలకు రూ. 10 వేల వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని వారు కోరారు. ప్రతి విద్యార్థికి రూ.30 మెస్ చార్జీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసీ.బాదుల్లా, ఎస్.చాంద్‌బాషా, బి.కామాక్షమ్మ, ఎం.మేరి, కోశాధికారి ఎం.పార్వతి పాల్గొన్నారు.

గండికోట వివరాలిస్తే.. యునెస్కోలో అవకాశం



డీజీకి వినతిపత్రం ఇస్తున్న వీరాంజనేయులు

కడప కల్చరల్ : గండికోట వివరాలతో కూడిన డోసియర్(వివరాల పత్రం)ను వెంటనే పంపితే యునెస్కో జాబితాలో చేర్చేందుకు అవకాశం ఉందని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఢిల్లీ తిలక్‌మార్గ్ లోని కేంద్ర పురావస్తుశాఖ కార్యాలయంలో డీజీ యదువీర్‌సింగ్ రావత్‌తో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గండికోట, లేపాక్షి తదితర ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు యునెస్కో గుర్తింపు ఇవ్వాలని వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి కట్టడాలకు సంబంధించి వివరాలు ఇంతవరకు తమకు అందలేదని డీజీ యదువీర్‌సింగ్ రావత్ అన్నారన్నారు. రాష్ట్రంలోని 129కి పైగా చారిత్రక కట్టడాల్లో ఒక్క దానికి యునెస్కో జాబితాలో చోటు దక్కలేదని, కూటమి ప్రభుత్వం ఆలోచించి ఇకనైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చారిత్రక కట్టడాలకు యునెస్కోలో చోటు దక్కినపుడే రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందగలదన్నారు. పర్యాటకశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే నివేదిక పంపాలన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం.. రాయలసీమ హక్కు

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధ్యక్షులు వైవీ.సుబ్బారెడ్డి

కడప కల్చరల్: గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం వైఎస్సార్ కడప జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధ్యక్షులు వైవీ.సుబ్బారెడ్డి లేఖ రాశారు. 'సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ' కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి అభ్యర్థన మేరకు ఆయన ఈ లేఖ పంపారు. రాయలసీమ నడిబొడ్డున ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వ్యాపారం, లాభాలు, టెక్నాలజీ, లక్షిత వర్గాలకు అందిస్తున్న సేవలు....ఇలా ఏ కోణంలో చూసినా దేశంలోని గ్రామీణ బ్యాంకుల కంటే మిన్నగా పనిచేస్తున్నదన్నారు. ఈ ప్రాంతపు పౌర సమాజం, ప్రజా సంఘాలు, రాజకీయ ప్రతినిధులు అనుబంధాలకు అతీతంగా గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరుతున్నారన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు ఆపాలని, ఇది రాయలసీమ హక్కు అన్నారు.

వైద్య మిత్రలను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప రూరల్ : ఈ నెల 16వ తేదీలోపు తమను ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తిస్తూ జీఓ జారీ చేయకపోతే 17వ తేదీ నుంచి విధులను బహిష్కరిస్తామని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టులో పని చేస్తున్న వైద్య మిత్రలు, ఇతర సిబ్బంది స్పష్టం చేశారు. తమ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుకోసం ఆందోళన బాట పడుతూ విధుల బహిష్కరణకు సిద్ధమవుతున్నారు. బుధవారం విజయవాడలో ఆ ట్రస్టు సీఈఓ డాక్టర్ పి.రవిసుభాష్‌తో ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు జరిగిన చర్చలు విఫలమవడంతో సంఘం కడప జిల్లా నాయకులు తమ కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 17, 24వ తేదీల్లో జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట, 27న మంగళగిరి ట్రస్ట్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే వైద్య మిత్రలు విధులకు హాజరవుతారని ఆ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులు తెలిపారు.

ఆలయ సంరక్షణకు చర్యలు తీసుకుంటాం



కాశినాయన ఆశ్రమంలో కూల్చివేసిన భవనం పరిశీలిస్తున్న కె.కె.చౌదరి

కాశినాయన : వైఎస్సార్ జిల్లా కాశినాయన ఆలయ సంరక్షణకు చర్యలు తీసుకుంటామని ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కె.కె.చౌదరి అన్నారు. జ్యోతి క్షేత్రంలో కూల్చిన కాశినాయన ఆలయ భవనాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కాశినాయన ఆశ్రమంలో అటవీశాఖ అనుమతులు లేవని భవనం కూల్చిన విషయం ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లిందన్నారు. వెంటనే ఆయన స్పందించి ప్రభుత్వం తరఫున తనను వెళ్లి పరిశీలించమన్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరులో దక్షిణం వైపు ఉన్న కంపచెట్ల వద్ద జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.11,520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

అరటికాయల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లగొండువారిపల్లె ఘాట్ రోడ్డులో బుధవారం సాయంత్రం అరటికాయల లారీ బోల్తా పడింది. గ్రామ సమీపంలోని తోట వద్ద అరటి కాయలను లోడు చేసుకుని పులివెందులకు వస్తుండగా బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.

వేలంలో రూ 93.25 లక్షల ఆదాయం

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించారు. అనంతపురానికి చెందిన ఎంఆర్ ప్రాజెక్టు నిర్వాహకులు రూ.93.25 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు. గత ఏడాది రూ.81 లక్షల ఆదాయం వచ్చినట్లు పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు.

కర్ణాటక సరిహద్దులో రెండు ప్రైవేట్ బస్సులు ఢీ

- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- 40మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు



గంగాధర్ (ఫైల్ ఫొటో)



ఎదురెదురుగా ఢీకొన్న రెండు ప్రైవేట్ బస్సులు



ప్రమాద ఘటనలో గాయపడినవారు

మదనపల్లె : కర్ణాటక రాష్ట్ర సరిహద్దున మదనపల్లెకు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఏడుగురికి తీవ్రగాయాలవగా, 40 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి సువర్ణముఖి(సబర్వాల్) ప్రైవేట్ బస్సు మదనపల్లె మీదుగా బెంగళూరుకు వెళుతోంది. అదే సమయంలో బెంగళూరు నుంచి ఏఆర్‌బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నంద్యాలకు వెళ్తోంది. కర్ణాటక సరిహద్దు రాయల్పాడు సమీపంలోని గెలిజగూరు వద్దకు రాగానే రాత్రి 1 గంట సమయంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఏఆర్ ట్రావెల్స్ బస్సు ముందువైపు వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ, ఎదురుగా వచ్చిన సువర్ణముఖి బస్సును ఢీకొంది. ప్రమాదంలో మదనపల్లె కమ్మవీధికి చెందిన సువర్ణముఖి ప్రైవేట్ బస్సు కండక్టర్ గంగాధర్ అలియాస్ బాబు (59) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవర్ వెనుకసీటులో ఉన్న మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీనివాసపురం ఆస్పత్రికి తరలించారు. 22 మంది ప్రయాణికులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో చింతామణికి చెందిన వెంకటేష్ (40), కడపకు చెందిన అలీ(38), నంద్యాలకు చెందిన జవహరుద్దీన్(35), బెంగళూరుకు చెందిన జయకుమారి(30), ఆనందరెడ్డి(54), రాంప్రసాద్(57), రా యచోటికి చెందిన నిర్మల(38) తీవ్రంగా గాయపడగా, మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కర్ణాటక రాయల్పాడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను మదనపల్లె, బెంగళూరు, కోలారు, శ్రీనివాసపురం ఆస్పత్రులకు 108 వాహనాల్లో తరలించారు. ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.